# రోజూ వచ్చే ఉత్తరం

ఇచ్ఛాపురపు రామచంద్రం

"నీకొక చిన్న విషయం చెప్పాలోయ్" అన్నాడు సూర్యనారాయణ.

సత్యమూర్తి ఆశ్చర్యంగా చూశాడు. తనూ అతనికొక విషయం చెప్పా లనుకుంటున్నాడిదే క్షణంలో! ఐతే_అది తమకి సంబంధించినదీ కాదు, ముఖ్యమైనదీ కాదు. ఉబుసుపోక సమాచారమంతే.

సూర్యనారాయణా, సత్యమూర్తీ యిద్దరూ సమవయస్కులు, నలభై ఐదు నడుస్తున్నవారు. ఒకేసారి ఉద్యోగంలో చేరి - అదే ఊళ్ళో చెరో బీటులోనూ పోస్టుమాన్‌గా పనిచేస్తున్నవారు. ప్రతీ సాయంత్రమూ బీటయిపోయాక కలుసుకుని పార్కులోనో, ఏటివొడ్డునో కూర్చుని నాలుగు విషయాలూ మాట్లాడుకుంటారు. పెరిగే ధరలు, రాజకీయాలు, లోకం పోకడ, మారుతున్న కాలం— ఏదయినా వాళ్ళకి టాపిక్ ఔతుంది'

"చెప్పు—" అన్నాడు సత్యమూర్తి.

"మా బీటులో ఒకామె ఉంది. పేరు-రమ. ముప్ఫయ్యేంటుంది వయసు. అందంగా ఉంటుంది ."

సత్యమూర్తికి కొంచెం ఉత్సాహం వచ్చింది. తలలు బోడులయిన తలపులు బోడులా అనేది-మగవాళ్ళ తత్వాన్ని కాచి వడబోసి తేల్చిన సత్యం. మగవాడికెంత వయసు వచ్చినా పర స్త్రీ ఎప్పుడూ కుతూహలమే....కనీసం మానసికంగా అయినా.

"ఆమెకు రోజూ ఒక కవరు వస్తుంది. గులాబిరంగు కవరు. సెంటు వాసన. అందమయిన కవరు. బేరింగ్ పడుతుందేమో అనిపించేంత బరువు."

చిత్రంగా చూస్తున్నాడు సత్యమూర్తి.

తల్లి పుట్టిల్లు మేనమామకెరుకే. పోస్టుమాన్‌గా తల పండినవాళ్ళం ఏ కవరులో ఏముంటుందో మనకి తెలియదూ. కచ్చితంగా ఆమెకు వచ్చేవి ప్రేమలేఖలే."

సత్యమూర్తి శ్రద్ధగా వింటున్నాడు. అంత కచ్చితంగా అవి ప్రేమలేఖలే అని ఎలా చెప్పగలవన్నట్లు చూసాడు.

"గులాబిరంగు కవరు...సెంటు పూత పూసినది. ఇంకెవరు రాస్తారు? రోజూ ఒకే రకం కవరు...ఎడ్రస్... అదే చేవ్రాత....బంధువులూ, స్నేహితులూ రోజూ వ్రాయరు. వ్రాసినా ఒకే రకం కవరు వ్రాయరు. పైన ఫ్రమ్ అడ్రసు లేని ఒకే రకం కవరు...రోజూ..."

"ఊం."

"చిత్రమేమిటంటే ఆమె వయసు ముప్ఫయ్‌రెండు. ఓ పిల్లడు. ఏడెనిమిదేళ్ళ కిందటే పెళ్ళయింది."

ఈసారి నిజంగా ఆశ్చర్యపోయాడు సత్యమూర్తి. "ఏమిటీ? ముప్ఫయ్‌ రెండేళ్ళ ఆడదానికి, బిడ్డ తల్లికి, సంసారికి ప్రేమా! పిదపకాలం, పిదప బుద్ధులూ! ఈ సినిమాలూ నవలలూ ప్రజలని తెగ పాడు చేసేస్తున్నాయి. అందులోనూ ఆడవాళ్ళని మరీను."

"మరే. లేకపోతే...ఆవిడకీ వయసులో ప్రేమలేఖలేమిటీ?"

"ప్రేమలేఖే అంటావా?"



సూన్నారాయణ సిగ్గు పడుతూ ... తల వంచుకుని "అనుమానమూ, కుతూహలమూ అతి చెడ్డవి సుమా! మంచివాడిచేత కూడా తప్పు చేయించగలవు. నా సందేహం తీర్చుకుందుకు ఒక కవరు విప్పి చదివాను. ఛీ...దాన్నిండా ప్రేమా, శృంగారమే. సెక్స్ కథలా ఉంది. బాధపడవలసిన విషయమేమిటంటే యీ యిల్లాలు ప్రేమించినతనితో రాతలతో సరిపెట్టడం లేదు. చేతలలోకి కూడా దిగిపోయింది. తమ మధ్య జరిగే శృంగారాన్నత నెంత పచ్చిగా రాశాడని. నాకయితే అసహ్యం వేసి సాంతమూ చదవలేక పోయాననుకో. కవరంటించి డెలివర్ చేసేశాను. ఆమెకు ఉత్తరం వస్తుందని కచ్చితంగా తెలుసు కనుకనే ఆ వేళకి గేటు దగ్గర నిలుచుంటుంది. ఆ కాపురం ఇంకెన్నాళ్ళో సాగదు పెళ్ళయీ ప్రేమించే ఆడది; మొగుడుండీ ప్రియుడితో కులికే గ్రంథసాంగురాలు....పిల్లతల్లి అయీ పరపురుషుడికి పరువం అర్పించే పడుపుకత్తె....సంసారం చేస్తుందా? నేడో రేపో మంచిరోజు చూసి...ఆ పిల్లని కూడా వదిలేసి....అతనితో లేచిపోదూ? బరి తెగించినది కాకపోతే యిల్లాలికా ప్రేమలూ, ప్రేమలేఖలూ. తిరుగుళ్ళూ ఏమిటి మొగుడి కళ్ళు కప్పి? పిదపకాలం....మనం ఎలాగేనా ఆ సంసారాన్ని నిల బెట్టాలి" ఆవేదనా, తాపత్రయమూ నిండిన కంఠంతో అన్నాడు సూన్నారాయణ. అతను చాలా ప్రజాసేవకుడు కాకపోయినా, పోస్టుమానే అయినా....చేతిలో ఉన్న సాయం చేద్దామనే బుద్ధి కలవాడు. ఈతనికి సరిపోయేవాడే సత్యమూర్తి. ఒక రకం పక్షులు ఒకేచోట చేరుతాయి.

"సమయం దగ్గర పడినట్లే అనిపిస్తూంది. నేడో రేపో ఆ యిల్లాలు... మహాపతివ్రత....అతనితో లేచిపోతుంది. ఆ ప్రియుడూ అందమైన యీమెను మోజు తీరాక వదిలేసి పోతాడు. అప్పుడు తెలుస్తుందీవిడగారికి - ప్రేమకీ సంసారానికీ తేడా కాని-ఏం లాభం? అప్పటికంతా ఐపోతుంది. జీవితం నాశనమై పోతుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టే...." జాలివల్ల కలిగిన కోపంతో కఠినంగా అన్నాడు సూన్నారాయణ. ఆ యిల్లాలి ప్రేమనెంత అసహ్యించుకొంటు న్నాడో, ఆమె భవిష్యత్తుని తలుచుకుని అంత జాలి పడుతున్నాడు కూడా అతను.

"ఆ ఉత్తమ యిల్లాలు సవ్యంగా కాపరం చేసుకోక యిదేం బుద్ధి?"

"ఒళ్ళు పొగరు. అందమయినదని గర్వం. ఆపైన—భర్త ఆఫీసుకి పోతే ఒంటరిగా ఉంటుంది కదా? ఏం చేసినా అతనికి తెలియదన్న ధీమా! సినిమాలూ, కథలూ సరే సరి. ఆడవాళ్ళు మరీ చెడిపోతున్నారు కలికాలం కాదు కానీ...."

"ఆడవాళ్ళే అన్నమాటేమిటిలే ...మగవాళ్ళూ అంతే. లేకపోతే మగవాడు ఏం చేసినా మనం పట్టించుకోం. లేటెస్ట్ ఫ్యాషనేమిటో తెలుసా మగాళ్ళకి?" అడిగాడు సత్యమూర్తి.

"ఊహుఁ....ముసిలాణ్ణి నాకేం తెలుస్తాయి? నాకంటె ఏడాదే చిన్నయినా నువ్వు కుర్రాడివే. చెప్పు"

"చిన్నిల్లు....బ్రాంచి"

అర్థం కానట్లు చూశాడు సూన్నారాయణ.

"పెళ్ళి పెళ్ళాం—పెద్దిల్లు. ప్రేమించినదో, ఉంచుకున్నదో చిన్నిల్లు. ఇలా ఎన్ని బ్రాంచిలుంటే అంత గొప్ప మగవాళ్ళకి. నా బీటులో ఒక ఆఫీసుంది. అందులో ముప్పయ్యారో, ముప్పయ్యేడో ఏళ్ళవాడొకడున్నాడు. అతని పేరు ఆనంద్. పెళ్ళీ పిల్లలూ అయ్యే ఉంటాయి. కాని-అతనికీ రోజూ నీలాగే నేనూ ఓ కవరిస్తూ ఉంటాను. నీలంరంగు కవరు, సెంటువాసన....అదే చేతివ్రాత.... ఫ్రమ్ అడ్రసుండదు. బేరంగేమో అన్నంత బరువుగా. అతను నేనొచ్చే వేళకి గేటు దగ్గర కాసి తన ఉత్తరం తీసేసుకుంటాడు. అది రహస్యం కాకపోతే అతని కెందుకా జాగ్రత్తా, ఆత్రతా?"

"ఔను."

"అందుకే....ఒకసారి మనసుండబట్టక కవరు తెరిచాను. రామ రామ! అది రాసింది ఆడదంటే అసహ్యమేస్తుంది. పడకగదిని పరిచేసింది కాగితాలలో... పచ్చి శృంగారం....ప్రేమ కవిత్వం...సగం చదివి యిక చదవలేక కవరు అంటించేసి యిచ్చేశానేమీ ఎరుగనట్లు. నేడో రేపో అతను అగ్నిసాక్షిగా పెళ్ళాడిన ధర్మపత్నిని గెటౌట్ అనేసి ఆ చిన్నిల్లుని పెద్దిల్లు చేసేసుకుంటాడు ...తథ్యం. ఇంటి దగ్గరుండే ఆ యిల్లాలికేం తెలుస్తుంది. గడప దాటగానే మొగుడు చేసే ఘనకార్యాలు? వీధినపడ్డ మగాడికంతా స్వేచ్ఛే కదా? క్లబ్బుకి వెళ్ళినా, కేబరేకి వెళ్ళినా, కల్లు తాగినా, కడుపు చేసినా—ఏ అలస్యానికయినా ఒకటే సాకు. ఆఫీసు పని. పాపం ఆ యిల్లాలెంత అమాయకురాలో!" నిట్టూర్చాడు జాలిగా.

"సరే. ఒకటికి రెండు కేసులయ్యాయన్నమాట. సత్యం! మరి మనం చేయగలిగేదేమీ లేదా? కూలిపోబోతున్న రెండు కాపరాలని....నిలబెట్టడానికి ఏమీ చేయకుండా చేతులు ముడుచుకు కూర్చోడానికి మనం మానవత్వమూ, ధర్మమూ లేని నేటితరం వాళ్ళం కామే."

"ఏం చేద్దాం?" చెప్పమన్నట్లు చూశాడు సత్యమూర్తి.

"ముందు...లేడీస్ ఫస్ట్. ఆనంద్‌వల్ల మోసపోతున్న అతని యిల్లాలికి- ఆనంద్‌కి ఆఫీసుకి రోజూ వచ్చే ఉత్తరం సంగతి చెప్పి జాగ్రత్త పడమందాం. తరువాత రమ భర్తకి—ఆమెకి యింటికి రోజూ వచ్చే ఉత్తరం గురించి చెప్పి— భార్యని కట్టుదిట్టం చేసి కాపురం కాపాడుకోమందాం. అంతకంటే మనం చేయగలిగేదేముంది ప్రస్తుతానికి?"

"ఈ మాత్రమయినా ఘనమే మనం చేసే చిన్న మంచిపనే-చిట్టెలుక సింహాన్నిలా ఆ సంసారాలని రక్షించగలదేమో? స్టిచ్ యిన్ టైమ్ సేవ్స్ నైన్...కాని సూన్నాణా! ఇవి కొంచెం సున్నితమయిన ఆలుమగల విషయాలు. ఇద్దరం కలిసే వెళ్ళడం బాగుంటుందేమో ఒక్క మగవాడినయితే అపార్థం చేసుకోవచ్చు"

"నిజమే. రేపు నువ్వు ఆనంద్‌ని వెంబడించు. అతని యిల్లు తెలుసుకో. నేను రమ భర్త కోసం బీటు వేస్తాను. అతను వస్తాడుగా యింటికి. అప్పుడు పరిచయం చేసుకుంటాను. మిగిలిన కార్యం ముట్లాడ్డం. ఇద్దరమూ కలిసే చేద్దాం. ఏం?"

"ఓ.కె"

ఇతరులకి తమకి సాధ్యమయిన కొంచెం అయినా మంచి చేద్దామనే తాపత్రయం కలిగిన ఆ పోస్టుమెన్‌లు యిద్దరూ రేపటి కార్యక్రమం నిర్ణయించుకుని చీకటి పడుతూంటే యిళ్ళకి వెళ్ళిపోయారు.

* * *

ఉత్తరాల బట్వాడా అయిపోగానే రమ యింటిముందు మఫ్టీలో నిలుచుని నిరీక్షిస్తున్నాడు సూన్నారాయణ. యూనిఫామ్‌లో లేని అతన్ని గుర్తుపట్టడం కొంచెం కష్టమే రోజూ చూసేవారికి కూడా. అతను రమ యింటి గేటుమీద దృష్టి వేసి ఉంచినా దానికి కొంత దూరంలో మెయిన్‌రోడ్‌కి దగ్గరగా నిలుచుని నిముషాలు లెక్కపెడుతున్నాడు.

కాలం చాలా మెల్లగా నడుస్తోందతనికి—నిరీక్షణ కనుక.

ఒక్కసారి తను ఆశ్చర్యపోయాడు. ఇదేమిటి? సత్యమూర్తి ఇటు వస్తున్నాడేం? అతనికి ముందు....ముప్ఫయ్ ఐదూ, ముప్పయ్యారూ ఏళ్ళ పెద్ద మనిషి! అతనేనా ఆనంద్? అతన్ని వెంబడిస్తూనే వస్తున్నాడా సత్యమూర్తి? ఆనంద్ యిల్లూ ఈ వీధిలోనే అన్నమాట!

సూన్నారాయణ తనని దాటిపోతున్న సత్యమూర్తి వేపు చూశాడు. ఏమీ మాట్లాడకుండా తన వెంట రమ్మన్నట్లు నేత్రావధానం ద్వారా సూచించాడు సత్యమూర్తి. సూన్నారాయణ అతని వెనుక కదిలాడు. అయితే ఆ పెద్దమనిషి ఆనందే అన్నమాట! ముంగిలా ఎంత అమాయకంగా మంచివాడిలా కనిపిస్తు న్నాడు.

మెరిసేదంతా బంగారం కాదు. ఈ మాయ రోజుల్లో మరీకాదు.

అరె! అదేమిటి? ఆనంద్-రమా వాళ్ళింటి గేటు తీస్తున్నాడు! ఈ డోర్‌లో ఎప్పుడూ ఆనంద్ పేరిట ఉత్తరాలివ్వలేదే! సత్యమూర్తి పొరబడ్డాడా? ఇది ఆనంద్ యిల్లు కాదేమో. రమ భర్త అతని ఫ్రెండ్ ఏమో. రమ భర్త కోసం వస్తున్నాడేమో ఆనంద్.

ఇంక అతను నిగ్రహించుకో లేకపోయాడు. "సత్యమూర్తీ!" మెల్లగా పిలిచి చేయి పట్టుకు ఆపేశాడు గేటు దాటబోతున్నవాడినల్లా.

"ఏమిటి?" గొణిగాడు సత్యమూర్తి.

"ఇతను ఆనంద్ కాదు."

"ఆనందే! సందేహం లేదు"

"ఐతే ఇది అతని ఇల్లు కాదు. ఫ్రెండ్‌దయి ఉంటుంది"

"ఉహుఁ. ఆయనతో పనుందనీ యింటివద్ద మాట్లాడడానికి వస్తాననీ అడిగి అడ్రస్ తీసుకున్నాను ఉదయం కవరిస్తూ. నిశ్చయంగా యిదే డోర్ నెంబరు."

"కాని యిది ఆ యిల్లాలి....రమ డోర్ నెంబరు"

అర్థమైనట్లు నోరు తెరచి "ఆ!" అన్నాడు. ఆశ్చర్యంతో "అంటే..."

'ఆనంద్ పేరిట యిక్కడ ఉత్తరాలివ్వలేదు నాకు జ్ఞాపకమే."

"దానికేముంది? చాలామంది యింటి అడ్రస్‌లివ్వరు ఉద్యోగస్తులు. ఆఫీసు ఎడ్రసే యిస్తారు. ఉత్తరాలు అందేది ఆ వేళలలోనే కనుక."

"ఐతే....రమ... ఆనంద్-"

అదే క్షణంలో ఆ యింటి వరండాలో ఆమె అతనికి చిరునవ్వూ, టీ అందిస్తూంది.

"ఆవిడే రమ."

"అతనే ఆనంద్"

"అంటే... ఆ యిల్లాలు పరాయివాడితో ప్రేమ సాగిస్తూంది. ఆ మహానుభావుడు మరొక పగలాడితో కులుకుతున్నాడు. బాగుంది! దొంగకి దొంగే. ఇసుక తక్కెడా.... పేడ తక్కెడా...." అసహ్యంగా అన్నాడు సూన్నారాయణ.

"ఏమిటో యీ సంసారాలూ, మనుషులూ-ఇలాటివాళ్ళు పెళ్ళెందుకు చేసుకుంటారో, యిష్టమొచ్చిన వాళ్ళతో తిరగక. పెళ్ళి పరువూ పవిత్రతా చెడగొడుతున్నారు. చూడు చూడు....ఎంత ప్రేమ వొలకబోసు కుంటున్నారో మనసులో అంతంత కుళ్ళు పెట్టుకుని! ఏం నటన!"

"ఇప్పుడేం చేద్దాం?" అడిగాడు సత్యమూర్తి అయోమయంలో పడ్డట్లు.

"బొత్తిగా రోడ్డుమీదున్నాం. పక్కకి పద. మాట్లాడుకుందాం...." అని అతన్ని చేయి పట్టుకుని నడిపించాడు సూన్నారాయణ.

"చెప్పు-" అంటూ సిగరెట్ అందించాడు సత్యమూర్తి.

"రెండే మార్గాలు గనిపిస్తున్నాయి. ఆ ఆడదీ మగాడూ ఒకరికంటే ఒకరు ఘనులు కనుక—మనం వాళ్ళ నుద్ధరించవలసిన పనిలేదు. వాళ్ళే మనకి పాఠాలు చెబుతారు. కనుక వెనక్కి పోవడం తోక ముడుచుకుని.

లేదా మీ దంపతులిద్దరూ యిలా చేస్తూ పెళ్ళి పరువూ పవిత్రతా తీసి పారేస్తున్నారని నమ్మకంగా చీవాట్లు పెట్టడం—పెద్దరికంకొద్దీ"

"ఇదే చేద్దాం జరిగిందేదో జరిగింది. యికనయినా బుద్ధిగా సంసారుల్లా ఉండమందాం. ఎలాగూ యింతవరకూ రానే వొచ్చాం కదా? ఈ మాత్రం ధర్మం నిర్వర్తించేస్తే మనసుకి తృప్తి."

"సరే...పద. కానున్నది కాకమానదు."

"రండి రండి-" ఆహ్వానించాడు ఆనంద్. "ఈయన?" ఎవరన్నట్లు చూశాడు సూన్నారాయణవేపు.

"మన పోస్టుమానేనండి! రోజూ ఉత్తరాలిచ్చే ఆయనే ఓహ్! మీరావేళకి ఇంటి దగ్గరుండరు కదా! అందుకని మీకాయన తెలియదు" అంటూ సత్యమూర్తి ఎవరన్నట్లు చూసింది.

"ఆయన ఆఫీస్ పోస్టుమన్. నాకు రోజూ ఉత్తరాలిచ్చేది ఈయనే బాగుంది. ఇద్దరు పోస్టుమన్‌లూ కలిసే వొచ్చారే! ఏమిటి సంగతి?"

ఈలోగానే రమ ఆ యిద్దరికీ టీ తెచ్చి అందించింది.

"చెప్పండి....ఏమిటి మీకు నాతో పని?"

"ఆ....అదికాదు...." నసిగాడు సూన్నారాయణ.

"ఫరవాలేదు. మా ఆఫీసులో నేను మీకు చేయగలిగే సహాయం అంతా చేస్తాను. ఎందుకంటే నేనూ రమా మీకు, మీ పోస్టుమన్‌కి చాలా ఋణపడి ఉన్నాం. అది తీర్చుకుందుకయినా నేను చేయగలిగేవి చేస్తాను"

"మీరు మాకు ఋణపడటమేమిటి? ఎలా?" అడిగాడు సత్యమూర్తి కొంచెం ఆశ్చర్యపడుతూ.

ఆనంద్ మొహమాటపడుతూ..."అదెందుకులెండి. మీ పని చెప్పండి." అన్నాడు.

"ప్లీజ్.... మమ్మల్ని సస్పెన్స్‌లో ఉంచకండి. మీరుచెప్పేది విన్నాక కానీ మేమేమీ మాట్లాడలేం." అనేశాడు సత్యమూర్తి.

ఆనంద్-రమవేపు చూశాడు— ఏంచేయమంటా వన్నట్లు.

"ఫరవాలేదు, అంత సిగ్గుపడడానికేముంది? చెప్పెయ్యండి." అందామె గ్రీన్‌సిగ్నల్ యిస్తూన్నట్లు.

"రమా నేనూ ప్రేమించి పెళ్ళిచేసుకున్నాం, ఇద్దరమూ కథలంటే చాలా యిష్టపడుతూ- పత్రికలకి కథలమీద ఉత్తరాలు వ్రాసేవాళ్ళం. మేమలాగే పరిచయం ఐ- ప్రేమించుకుని పెళ్ళిచేసుకున్నాం- పదేళ్ళకిందట. ఐతే ఈమధ్య... ఓ ఏడాదికిందట - మేము వెనుదిరిగి చూసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. మామధ్య ప్రేమ తక్కువై పోతుందేమో.... యింకిపోతూందేమో అని అనుమానం వొచ్చింది. ఎంత పెళ్ళయినా... సంసారంచేస్తున్నా... దాంపత్యాన్ని ప్రేమమయంగా ఉంచుకోకపోతే జీవితం రసవిహీనమేకదా? అందుకని మామధ్య అనాటి ప్రేమను మళ్ళీ ప్రవహింపజేసుకుందుకు- ఒక పని మొదలుపెట్టాం. ఇద్దరమూ లేఖారచనా కళలో ప్రవేశమున్నవారమే కనుక పెళ్ళికి ముందరిలాగే ప్రేమలేఖలు వ్రాసుకోవాలి రోజూ. విధిగా ప్రతిరోజూ ఒక ఉత్తరం - ఆమె నాకూ. నేను ఆమెకూ. దీనివల్ల ఆమెకు కాలక్షేపం. నాకు సరదా. రేపేంరాస్తారో అనే కుతూహలం. జీవితాలు ఉత్సాహభరితం అయ్యాయి మేమాశించినట్లే.

ఉత్తరం వ్రాయడం ఒకెత్తు. అది అందుకోడం ఒకెత్తు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ మునుపటిలా పనిచేయడంలేదనీ... సమర్థత తగ్గిపోయిందని ప్రబలిన అపప్రథను వమ్ముచేస్తూ- మీరిద్దరూ మా ఉత్తరాలను ఒక్కటీ పోకుండా.... ఆలస్యంకాకుండా అందించి.... మా ప్రేమలతను పెంచారు. అందుకే మీకు మేము చాలా ఋణపడిఉన్నాం.'

తెల్లబోయారు సూన్నారాయణా, సత్యమూర్తీ.

"ఆ ఉత్తరాలు.... కవిత్వానికీ, శృంగారానికీ, దైనందిన జీవితానికీ, దాంపత్యజీవితానికీ ప్రతిబింబాలు. వీటి విలువ మాకు అనంతం. అవన్నీ జాగ్రత్తగా అందిస్తూ మా దంపతులమధ్య ప్రేమవాహినిని ప్రవహింపజేసిన మీ ఇద్దరికీ ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం నేనూ రమా?"

సూన్నారాయణా సత్యమూర్తీ- ఏదో గొణిగి.... అక్కడినుంచి బయట పడ్డారు.

***